RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## మృతిచెందిన ఏకలవ్య టీచర్లకు బాసట

### వారి కుటుంబాల్లో ఇద్దరికి ఉద్యోగాలు

అమరావతి,ఆగస్ట్20: పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 16న వాగులో కొట్టుకుపోయి చనిపోయిన ఇద్దరు టీచర్ల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఏపీ మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. సాలూరు మండలం సరాయివలస గ్రామంలో ఏకలవ్య పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్తి, వా÷-డ్గ్÷న్‌గా పనిచేస్తున్న మహేశ్ విధులు నిర్వహించుకుని తిరిగి వారు నివాసముంటున్న గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. వారు ఒట్టిగెడ్డవాగులో వాగును దాటే క్రమంలో ఇద్దరు ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఆర్తి మృతదేహం దొరకగా, మహేశ్ మృతదేహం మరుసటి రోజు లభించింది. వీరిద్దరూ మృతి చెందడం పట్ల ఏపీ ప్రభుత్వం స్పందించి మృతదేహాలను అంబులెన్స్‌లో స్వస్థలమైన హర్యానకు పంపింది. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మంగళవారం మాట్లాడుతూ ఘటనలో మృతి చెందిన వీరిద్దరి కుటుంబాలకు ఉద్యోగం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక :104 బుధవారం 21-08-2024 పేజీలు :04 వెల:రూ.2.00

# జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమం



అమరావతి,ఆగస్ట్20 : వచ్చే జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమం నిర్వహిస్తామని సిఎం చంద్రబాబు అన్నారు. గ్రామా భివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తామని సీఎం తెలిపారు. పంచా యతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 990 కోట్లు, జల్ జీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర వాటా రూ. 500 కోట్లు విడుదల చేస్తామని సీఎం చెప్పారు.పంచాయతీ రాజ్ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి వెలుగులు నింపుతామని అన్నారు. పంచాయ తీరాజ్ శాఖను బలోపేతం చేస్తామ న్నారు. ఒక ఇంటికి, ఒక గ్రామానికి, ఒక ప్రాంతానికి ఏం అవసరమో గుర్తించి.. ఆ సదుపా యాలను కల్పిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సమీక్షా సమావేశం లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సంబంధిత శాఖా అధికారు లు పాల్గొన్నారు. ఇదిలాఉంటే.. స్థానిక సంస్థల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,452 కోట్ల నిధులు విడుదల చేసింది. స్థానిక సంస్థల బలోపేతమే కూటమి ప్రభు త్వ లక్ష్యం అని.. సీఎం చంద్రబాబు సూచనల మేరకు నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తే.. తాము బలోపేతం చేస్తున్నామ న్నారు. స్థానిక సంస్థల కోసం రూ. 1452 కోట్ల నిధుల విడుదల చేసింది కూటమి ప్రభు త్వం.. గత ప్రభుత్వం పక్కదారి పట్టించిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తున్నట్టు పేర్కొంది.. గ్రామ పరిధిలోని స్థానిక సంస్థలకు రూ. 998 కోట్లు,

### గ్రామాల బలోపేతం లక్ష్యంగా నిధులు
### స్థానిక సంస్థల అభివృద్ధి కోసం 1,452 కోట్లు విడుదల
### పంచాయితీరాజ్ సమీక్షల్లో చంద్రబాబు వెల్లడి



అర్బన్ పరిధిలోని స్థానిక సంస్థలకు రూ. 454 కోట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లా డుతూ.. స్థానిక సంస్థల బలోపేతమే ప్రజా కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.. ముఖ్యమంత్రి చంద్రబా బు సూచనల మేరకు స్థానిక సంస్థల కు నిధులు విడుదల చేశాం. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్య ం చేస్తే.. మేం వాటిని బలోపేతం చేస్తున్నాం అన్నారు.. గ్రామాల అభివృ ద్ధితోనే దేశ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి అని మహాత్మా గాంధీ ఆశయాలను పాటించే ప్రభుత్వం మాది అన్నారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపే తం చేయడం ద్వారా కూటమి ప్రభు త్వం అభివృద్ధికి బాటలు వేస్తోంద న్నారు. ఈ నిధులతో గ్రామ, వార్డు స్థాయిల్లో పనులను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు సూచిం చారు. ఈ నిధుల విడుదలతో స్థానిక సంస్థలకు ఆర్థికంగా వెసులుబాటు కలిగే అవకాశం కలుగుతుందని వెల్లడించారు ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్..

# ఏపీలో హెచ్‌సిఎల్ భారీ విస్తరణ

### మరో 15 వేల ఉద్యోగాలకు అవకాశం
### మంత్రి లోకేశ్‌తో ప్రతినిధుల భేటీ



అమరావతి,ఆగస్ట్20: ఏపీలో తన కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు హెచ్‌సీ ఎల్ సన్నాహాలు చేస్తోంది. ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయిన హెచ్‌సీఎల్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శివశంకర్, అసోసియేట్ వైఎస్ ప్రెసిడెంట్ శివప్రసాద్‌లు మరో 15వేల ఉద్యోగాల కల్పనకు సుముఖత వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్‌సీఎల్ సంస్థలో 4,500 మందికి ఉద్యోగాలు లభించాయి. విస్తరణ ద్వారా రాష్ట్రంలో మరో 5,500 మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఫేజ్ -2లో భాగంగా నూతన కార్యాల యం నిర్మాణం చేపట్టి మరో 10వేల మందికి ఉద్యోగ అవకా శాలు కల్పిస్తామని వెల్లడించారు. ఐటీలో ప్రస్తుతం అంతర్జాతీయంగా చోటుచేసుకున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా



అధునాతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న స్కిల్ సెన్సస్, సిల్క్ డెవలప్‌మెంట్‌లో తాము కూడా భాగస్వామ్యం వహిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. విస్తరణకు కావాల్సిన కొన్ని అనుమతులు, గత ప్రభుత్వం నిలిపివేసిన రాయితీలు విడుదల చేయాల్సిందిగా హెచ్‌సీఎల్ ప్రతినిధులు మంత్రి లోకేశ్ ని కోరారు. ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం యువత ఉపాధి అవకాశాలపై దృష్టి సారించింది. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను క్రమంగా భర్తీ చేస్తోంది. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం కంపెనీలతో చర్చలు జరుపుతోంది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వివిధ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. రాష్ట్రంలో కంపెనీలు నెలకొల్పి, స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాల గురించి మాట్లాడుతున్నారు. ఆ క్రమంలో హెచ్‌సీఎల్ కంపెనీ ముందుకొచ్చింది. భారీ విస్తరణకు ప్రణాళికలు రచించింది. గతంలో 4500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఈ సారి 10 వేల మందికి ఉద్యోగం ఇస్తామని చెబుతోంది. మొత్తం 15 వేల మందికి ఉపాధి కల్పిస్తామని హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందజేయాలని హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు కోరగా.. అందుకు మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది

## జగన్ అక్రమాస్తుల కేసు విచారణ

### సెప్టెంబర్ 17కు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్,ఆగస్ట్20( మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ మరోసారి వాయిదా పడింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలన్న పిల్‌పై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ కేసులప త్వరితగతిన విచారణ జరపాలని హరిరామ జోగయ్య పిల్ దాఖలు చేశారు. ఇప్పటికే జగన్‌తో పాటు సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రజాప్రతినిధుల కేసులను త్వరితగతిన జరపాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని పిటిషనర్ వాదించారు. ఈ క్రమంలో పిటిషన్లపై విచారణను సెప్టెంబర్ 17కు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.మరోవైపు ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకొంటున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి నమోదైన సీబీఐ కేసుల్లో తీర్పు వెలువడిన తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా ఆ పద్ధతినే అనుసరించాలని అప్పట్లో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును గతేడాది మే నెలలో ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆగస్టు 14న ఈడీ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. కేసు ప్రారంభమైన వెంటనే తాను విచారణ నుంచి తప్పుకొంటున్నానని జస్టిస్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. వాదనలు వినిపించేందుకు ఇరుపక్షాల న్యాయవాదులు సిద్ధమవగా జస్టిస్ సంజీవ్ కుమార్ లేని ధర్మాసనం ముందు పిటిషన్‌ను లిస్ట్ చేయనున్నట్టు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. సెప్టెంబరు 2 నుంచి మొదలయ్యే వారంలో సీజేఐ ఆదేశాల మేరకు మరో ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని ఆయన ఆదేశించారు.

# కోల్‌కతా హత్యాచార ఘటనపై సుప్రీం విచారణ

### పని ప్రదేశాల్లో భద్రతపై సిజెఐ ఆందోళన
### ఆందోళనకారులపై బలప్రయోగం సరికాదు
### విచారణకు సంబంధించి స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ,ఆగస్ట్20: కోల్‌కతాలోని ప్రభుత్వ ఆర్‌జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మహిళా వైద్యురాలిపై అత్యాచారం,హత్య కేసుపై సుప్రీం కోర్టు విచారణ ప్రారంభించింది. సూమోటోగా తీసుకున్న కేసును విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలు పని ప్రదేశాల్లోనే భద్రత లేకపోయే వారికి సమానత్వం ఎక్కడ వస్తుందని ప్రశ్నించారు. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ.. కోల్‌కతా అత్యాచారం కేసును హైకోర్టు విచారిస్తోందని తెలుసు కానీ ఈ దుర్ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఓ వైద్యుల భద్రతకు సంబంధించిన అంశం కావడంతో సూమోటోగా తీసుకొని విచారిస్తున్నాం అని అన్నారు. ఈ కేసులో ఎఫ్‌ఐఆర్ కూడా ఆలస్యంగా దాఖలయ్యింది. ఆ ఎఫ్‌ఐఆర్‌లో హత్య ప్రస్తావన ఉందా?. కేసును ఆత్మహత్యగా చెబుతున్నప్పుడు ప్రిన్సిపాల్ ఏమి చేస్తున్నారనేది అతిపెద్ద ప్రశ్న' అని చీఫ్ జస్టిస్ అడిగారు. దీనిపై విచారణ చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ తన విచారణకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును కోర్టు ముందు ఉంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దర్యాప్తు స్థితిని కూడా తెలియజేయాలని సూచించింది. అనంతరం కేసు విచారణమను గురువారానికి వాయిదా వేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే వ్యక్తులపై బలప్రయోగం చేయొద్దని ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. మీడియాలో విమర్శించే వ్యక్తులపై కూడా చర్యలు తీసుకోవద్దని సూచించారు. బాధితురాలి కుటుంబానికి రాత్రి 8.30 గంటలకు మృతదేహం అప్పగించారని తర్వాత 11.45 గంటలకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని, అది కూడా తండ్రి ఫిర్యాదుపైనేనని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ సమయంలో ఏం జరిగిందని సీజేఐ ప్రశ్నించారు. అంతేకాకుండా ఓ గుంపు వచ్చి మెడికల్ కాలేజీని ధ్వంసం చేస్తే పోలీసులు ఏం చేశారని నిలదీశారు. నేరం జరిగిన ప్రాంతానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్ మాట్లాడుతూ సమాచారం లేకుండా 10 వేల మంది గుమిగూడినట్టు చెప్పుకొచ్చారు. అసలు ఏంజరిగిందో గురువారం నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఆసుపత్రుల్లో, ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో యువ వైద్యుల దుస్థితి గురించి మాట్లాడారు. వాళ్ల పరిస్థితి ఏం బాగాలేదని అన్నారు. వారంతా ఇంటర్న్‌లు, రెసిడెంట్ డాక్టర్లు అన్నింటికంటే ముఖ్యంగా మహిళా డాక్టర్లు అని తెలుసున్నారు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్. యువ వైద్యుల్లో చాలా మంది 36 గంటల పాటు పని చేస్తున్నారని తెలుస్తోంది. అక్కడ కూడా సరైన వసతులు భద్రత లేదనేది సమాచారం. సురక్షితమైన పని పరిస్థితులు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యల కోసం జాతీయ ప్రోటోకాల్ డెవలప్ చేయాల్సి ఉంది.

## చంద్రబాబు ఇంటిపై దాడి కేసు

### మరోమారు విచారణకు జోగి గైర్హాజరు

గుంటూరు,ఆగస్ట్20(: మాజీ మంత్రి జోగి రమేష్ మంగళవారం మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు గైర్హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దాడికి సంబంధించిన కేసులో ఇదివరకే జోగిరమేష్ పోలీసుల విచారణను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈరోజు మరోసారి విచారణకు రావాల్సి ఉండగా.. జోగి రమేష్ గైర్హాజరయ్యారు. మాజీమంత్రి తరపున ఆయన న్యాయవాదులు మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. జోగి రమేష్ విచారణ రావడం లేదని లాయర్లు స్పష్టం చేశారు. కాగా... చంద్రబాబుపై ఇంటిపై దాడి కేసులో జోగిరమేష్‌కు పోలీసులు ఈరోజు మరోసారి నోటీసులు జారీ చేశారు. జోగిరమేష్ సహా మరికొందరికి పోలీసులు నోటీసులు అందజేశారు. ఈ క్రమంలో ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు వైసీపీ నేత పోలీసుల విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే మాజీ మంత్రి విచారణకు హాజరుకావడం లేదని జోగిరమేష్ తరపు న్యాయవాదులు పోలీసులకు తెలియజేశారు. ఇప్పటికే ఈ కేసు విచారణను ఓపెన్ చేసిన పోలీసులు గత శుక్రవారం జోగి రమేష్‌ను మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో గంటన్నర పాటు విచారణ చేశారు. ఆయన ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం జోగిని పోలీసులు ఇంటికి పంపించివేశారు. అయితే ఈరోజు మరోసారి విచారణకు రావాల్సిందిగా జోగిరమేష్‌తో మరికొందరికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు.

# వెలుగొండ హెడ్ రెగ్యులేటర్ పనుల్లో నాణ్యతాలోపం

### కడప కాంట్రాక్టర్‌కు అప్పనంగా నిధులు విడుదల
### ఇరిగేషన్ విధ్వంసానికి జగన్ పాలనే నిదర్శనం
### జగన్ చేసిన తప్పులను కూడా భరించాలా
### మండిపడ్డ మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): వెలుగొండ ప్రాజెక్టు పటిష్టతపై మంత్రి నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. వెలుగొండ హెడ్ రెగ్యులేటర్ పనుల్లో నాణ్యత లేదని మంత్రి నిమ్మల మండిపడ్డారు. గత ప్రభుత్వంలో చేపట్టిన వెలుగొండ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ ప్రాజెక్టు పనుల్లో నాణ్యత సరిగా లేదని ఆయన విమర్శించారు. హెడ్ రెగ్యులేటర్ పనుల నాణ్యతపై అనుమానం ఉందన్నారు. వెలుగొండ హెడ్ రెగ్యులేటర్ పనులు కడప జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ చేపట్టాడని.. ఒక్క పైసా పెండింగ్ లేకుండా బిల్లులన్నీ డ్రా చేసేసుకున్నారని మంత్రి పేర్కొన్నారు. వెలుగొండ పనులు చేపట్టిన అధికారులే ఈ విషయం మా సమీక్షల్లో చెబుతున్నారని ఆయన తెలిపారు. వాళ్ల మెడకు చుట్టుకుంటుందనే భయంతో అధికారులు వాస్తవాలు బయట పెడుతున్నారని వెల్లడిం చారు. కాంట్రాక్టర్ చేపట్టిన హెడ్ రెగ్యులేటర్ పనులను నాడు అధికా రులు కూడా సరిగా పర్యవేక్షించ లేదన్నారు మంత్రి రామానాయుడు. పరదాలు కట్టి.. ప్రజలు రాకుండా వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించారంటూ ఆయన ఆరోపించారు. వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం ఇస్తూ నిర్వాసితులకు నోటీ సులిస్తారా..? అంటూ ప్రశ్నించారు. జగన్ అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అని.. ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. జగన్ చేసిన అప్పులే కాదు.. తప్పులు కూడా మేమే భరించాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇరిగేషన్ ప్రాజెక్టు జగన్ విధ్వంసక పాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. వెలుగొండ టన్నెల్-1 500 మీటర్లు, టన్నెల్ -2లో 7 కిలో మీటర్ల లైనింగ్ పను లు గత ప్రభుత్వం పూర్తి చేయలేదని.. లైనింగ్ పూర్తి చేయకుండా నీటి విడుదల సాధ్యమా..? అంటూ మంత్రి ప్రశ్నించారు. టన్నెల్ బోరింగ్ మిషన్- టీబీఎం రెండో టన్నెల్లో చిక్కుకుపోయిందని.. మూడేళ్ల నుంచి టీబీఎం టన్నెల్లో చిక్కుకున్నా.. తాడేపల్లి ప్యాలెస్సులో జగన్ మొద్దు నిద్ర పోయారంటూ విమర్శించారు. వెలుగొండ నీరు ప్రవహించాల్సిన ఫీడర్ కెనాల్‌కు గండ్లు పడ్డాయని మంత్రి తెలిపారు. చిన్నపాటి వర్షానికే ఫీడర్ కెనాల్‌కు గండ్లు పడ్డాయన్నారు. 11 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే.. ఫీడర్ కెనాల్‌కు పడిన గండ్ల నుంచి నీరు గ్రామాలను ముంచెత్తుతోందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వెలుగొండ ప్రాజెక్టు.. నల్లమల సాగర్‌లో అర టీఎంసీ నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వెలుగొండ రిజర్వాయర్ నిర్వాసితులకు రూ. 1100 కోట్లు ఆర్ అండ్ ఆర్ అవసరమని.. ఐదేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా నిర్వాసితులకు విడుదల చేయలేదంటూ మండిపడ్డారు. వెలుగొండ ప్రాజెక్టును అన్ అప్రూవుడ్ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటిస్తే జగన్ నిద్ర పోయారని మంత్రి ఆరోపించారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూ. 4 వేల కోట్లు అవసరమవుతాయని ఆయన తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదన్నారు. గత ఐదేళ్ల కాలంలో ఇరిగేషన్ కోసం నామమాత్రపు ఖర్చు చేశారన్న ఆయన.. మా ఐదేళ్లల్లో రూ. 68 వేల కోట్ల ఖర్చు పెడితే.. వైసీపీ హయాంలో రూ. 19 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులకు గ్రీజు కూడా పెట్టలేకపోయారు.. గేట్లు కొట్టుకుపోయాయని మంత్రి విమర్శించారు. సోమశిల ప్రాజెక్టు గేట్లు, షట్టర్లు రోప్స్ తుప్పు పట్టిపోయేలా చేశారని పేర్కొన్నారు. నీరు నిండితే సోమశిల ప్రాజెక్టు గేట్లు మూస్తే గేట్లు కొట్టుకుపోతాయేమోననే ఆందోళన ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు కూడా సరిగా లేవన్నారు.

## వెలిగొండపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

### మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శలు

అమరావతి,ఆగస్ట్20 మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్ట్‌పై మాట్లాడే అర్హత జగన్మోహన్ రెడ్డికి లేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టును గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆపింది జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. ఆనాడు చంద్రబాబు సూచనలతో ప్రకాశం జిల్లా నేతలు అందరం ఢిల్లీ వెళ్లి వెలుగొండ ప్రాజెక్టు కోసం కేంద్ర మంత్రిని కలిశామని గుర్తుచేశారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కై ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తాకట్టు పెట్టావంటూ జగన్‌పై దుయ్యబట్టారు. ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా అన్ని వ్యవస్థలని సర్వనాశనం చేసిన చరిత్ర వైసీపీది అని వ్యాఖ్యలు చేశారు. గుండ్లకమ్మ గేటు పోయి మూడు సంవత్సరాలైనా పెట్టలేని పరిస్థితి వైసీపీదన్నారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థత వలన అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయిందని, పులిచింతల గేటు కొట్టుకుపోయిందన్నారు. వైసీపీ ఇసుక దోపిడీతో ప్రాజెక్టుల భద్రతకు ప్రమాదం ఏర్పడిందని చెప్పుకొచ్చారు.

# సంపాదకీయం

బుధవారం 21-08-2024

## సవాల్ విసురుతున్న మంకీ పాక్స్....

ప్రపంచానికి మంకీపాక్స్ కొత్త సవాల్ విసురుతోంది. ఆఫ్రికా దేశాల్లో హఠాత్తుగా కేసులు పెరిగిపోవడం, మిగిలిన దేశాలకు కూడా ఇది చాపకింద నీరులా వేగంగా వ్యాపిస్తుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. డబ్ల్యూహెచ్ఓ ఈ తరహా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడం రెండేళ్లలో ఇది రెండోసారి. 2022లో కూడా మంకీ పాక్స్‌ను హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్ఓ ప్రకటించింది. ఎం-పాక్స్‌గా పిలిచే మంకీ పాక్స్ వైరస్ ఇతర దేశాలకు కూడా వ్యాపించడంతో అటు ఆఫ్రికా దేశాలతో పాటు ఇటు ప్రపంచ దేశాలు గజగజ వణికిపోతున్నాయి.కరోనా తర్వాత అంతటి రేంజ్ లో భయానకంగా ఈ వ్యాధి మారింది. మంకీపాక్స్ వైరస్ ప్రపంచ దేశాలకు విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా ఆఫ్రికన్ యూనియన్ హెల్త్ ఏజెన్సీ తెలిపిన లెక్కల ప్రకారం జనవరి నుంచి ఆఫ్రికాలో ఎంపాక్స్ కేసులు 18,737కు చేరినట్లు, మృతుల సంఖ్య 541కు చేరినట్లు తెలుస్తోంది. తొలుత ఆఫ్రికాకే పరిమితమైన ఈ ప్రాణాంతక వైరస్ క్రమంగా ప్రపంచమంతా వేగంగా వ్యాపిస్తోందని, అప్రమత్తంగా లేకుంటే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని చిఊహా హెచ్చరికలు జారీ చేసింది. గతంలో కూడా మంకీపాక్స్ వైరస్ వెలుగు చూసినప్పటికీ ఈసారి మరింత ప్రమాదకరంగా మారే ప్రమాదం పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది . ఆఫ్రికా దేశాలతో పాటు మన పక్క దేశం పాకిస్థాన్‌లోనూ ఎంపాక్స్ కేసులు గుర్తించినట్లు చిఊహా ప్రకటించడంతో టెన్షన్ మరింత ఎక్కువైంది.మంకీ పాక్స్ వ్యాధి ఆఫ్రికా దేశాల్లో దశాబ్దాలుగా ఉంది. మరీ ముఖ్యంగా కాంగో దేశంలో ఈ వ్యాధి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. 1970లో తొలిసారి ఈ వ్యాధి ఆ దేశంలో వెలుగుచూసింది. కాంగోకు చెందిన 9 నెలల బాలుడికి మంకీ పాక్స్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఇది ప్రపంచంలో ఓ మనిషికి సోకిన తొలి మంకీ పాక్స్ వైరస్ కేసు. వాస్తవానికి పరిశోధనల కోసం తీసుకొచ్చిన కోతుల్లో మొట్టమొదటిసారి ఈ వ్యాధిని 1958లో డెన్మార్క్‌లో గుర్తించారు. అందుకే దీనికి మంకీ పాక్స్ అని పేరు పెట్టారు. మంకీపాక్స్ కేసు 2022లో మన దేశంలో కేరళలో కూడా ఒకటి నమోదైంది. జంతువుల నుంచి మనిషికి.. మనిషి నుంచి మనిషి ఈ వైరస్ వ్యాపిస్తుంది. కోతులు, ఉడతలు, ఎలుకలు కొరకడం, గోళ్లతో గీకడం, వాటికి దగ్గరగా ఉండటం, లేదా సరిగ్గా ఉడకకుండా వాటిని తినడం ద్వారా ఈ వైరస్ వాటి నుంచి మనుషులకు వ్యాపిస్తుంది. ఆఫ్రికా దేశాల్లో తొలినాళ్లలో వేటగాళ్లు ఎక్కువగా ఈ వైరస్ బారినపడినట్లు గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి.దశాబ్ధాలుగా మంకీ పాక్స్ వస్తూ పోతూ కాంగో సహా ఆఫ్రికా దేశాల్లో జనానికి ప్రత్యక్ష నరకం చూపుతోంది. పాత వ్యాధి కొత్త రూపు సంతరించుకొని ఇప్పుడు యావత్ ప్రపంచ దేశాలను భయపెడుతోంది. గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు కాంగోలో 27వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. 1100 మరణాలు సంభవించాయి. మంకీపాక్స్ అనే వైరస్ నుంచి ఈ వ్యాధి ప్రబలుతోంది. ఈ కేసులు పెరుగుతుండటంతో ఇది కూడా కోవిడ్ తరహాలో ప్రాణాంతకంగా మారే అవకాశముందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం మనిషి నుంచి మనిషికి ఈ ఎం పాక్స్ వైరస్ అత్యంత వేగంగా విస్తరించడం యావత్ ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. గర్భిణి మహిళ ఈ వైరస్ బారినపడితే.. గర్భాశయంలోని శిశువుకు కూడా ఈ వైరస్ వ్యాపించే అవకాశముంది. సెక్స్ కారణంగా ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదు. అయితే వైరస్ బారినపడి చర్మపు పగుళ్లు ఉండిన వ్యక్తితో మరో వ్యక్తి చర్మం రాపిడి జరిగితే వైరస్ వ్యాపించే అవకాశముందని వైద్య నిపుణులు చెబుతున్నారు.జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, అలసట, వాపుతో పాటు చీము నిండిన పొక్కులు ఎంపాక్స్ వైరస్ సోకిన వ్యక్తుల్లో సాధారణ లక్షణాలుగా కనిపిస్తాయి. ఈ పొక్కులు ముఖంపై మొదలై క్రమంగా శరీరమంతా విస్తరిస్తున్నాయి. సాధారణంగా ఈ పరిస్థితి రెండు నుంచి నాలుగు వారాలు ఉంటోంది. ఏ చికిత్స తీసుకోకున్నా అది తగ్గిపోతుంది కానీ.. ఆ తర్వాత దాని వల్ల రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కొన్ని సందర్భాల్లో అది ఏకంగా మరణానికీ దారితీస్తుండటం ఆందోళన కలిగించే అంశం. మరీ ముఖ్యంగా రోగనిరోధకశక్తి తక్కువ ఉండేవాళ్లు, అప్పటికే కొన్ని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ వైరస్ బారిన పడితే ఇక కోలుకోవడం కష్టంగా మారుతోంది.కొన్నేళ్లుగా ఆఫ్రికా దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ వ్యాధి.. ఇప్పుడు ఇతర దేశాలకు కూడా వ్యాపిస్తూ ప్రపంచ దేశాలను హడలెత్తిస్తోంది. ప్రస్తుతం ఈ వ్యాధి ప్రభావం 116 దేశాలపై ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 15,600 మంకీ పాక్స్ కేసులు నమోదవ్వగా 537 మంది మృతి చెందారు. ఇప్పటి వరకు తూర్పు, పశ్చిమ, మధ్య ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఎం-పాక్స్ ఇప్పుడు అమెరికా, యూరోప్‌కు కూడా వ్యాపించింది. స్వీడన్, పాకిస్థాన్ దేశాల్లోనూ తొలి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అయితే భారత్‌లో ప్రస్తుతం ఈ కేసులు ఏవీ నమోదుకాలేదు.ప్రస్తుతం ఈ వ్యాధికి ఎటువంటి చికిత్స లేదు. లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రస్తుతానికి ఉన్న మార్గం. స్మాల్ పాక్స్ కోసం రూపొందించిన మూడు వ్యాక్సిన్స్ మంకీపాక్స్ నివారణకు కూడా కూడా ఆమోదించారు. అయితే వీటికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇంకా ధృవీకరించలేదు. ఇప్పుడు ఎం-పాక్స్‌ను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించడంతో దీనిపై పరిశోధనకు, వైద్య సాధనాల అందుబాటు పెంచేందుకు నిధుల వెసులుబాటు పెరుగుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎం పాక్స్ కేసులతో ప్రపంచ దేశాలు అలెర్ట్ అయ్యాయి. ఇతర దేశాల నుంచి తమ దేశానికి ఈ వైరస్ సోకకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాయి. మంకీ పాక్స్ కేసులతో అప్రమత్తమైన చైనా.. తమ దేశానికి వచ్చేవారికి స్క్రీనింగ్ టెస్టులు చేస్తోంది.ప్రపంచ వ్యాప్తంగా మంకీ పాక్స్ వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇటు భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. కరోనా మహమ్మారిని ఎదుర్కొన్న తరహాలోనే మంకీ పాక్స్ వైరస్ ను ఎదుర్కొనేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు. మంకీపాక్స్‌ను ఎదుర్కొనే విషయంలో సన్నద్ధతపై ప్రిన్సిపల్ సెక్రటరీ నేతృత్వంలో హై లెవల్ రివ్యూ నిర్వహించారు. రాష్ట్రాల్లో టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు. వ్యాధిని త్వరగా గుర్తించేలా చర్యలు చేపట్టాలను అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

# ఆర్టీఐ చట్టంతో తగ్గనున్న తల్లిదీవెన ప్రారంభం

విజయవాడ, ఆగస్టు 20, అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ల పెంపుతో పాటు డిఎస్సీ నియామకాల వంటి హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చినా ఆర్థిక అంశాలతో ముడిపడిన హామీలపై మాత్రం రెండున్నర నెలలుగా మదనపడుతూనే ఉన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో గత మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరపున ఇచ్చిన హామీల్లో తల్లికి వందనం ప్రధాన హామీగా ఉంది. అమ్మఒడి స్థానంలో బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున చెల్లిస్తామని టీడీపీ మిత్రపక్షాల తరపున హామీ ఇచ్చారు. ఏపీలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అమ్మఒడి పథకానికి ప్రాధాన్యత ఇచ్చింది. తొలి ఏడాది విద్యార్థుల తరపున తల్లుల ఖాతాలకు రూ.15వేలు జమ చేశారు. ఐదేళ్లలో నాలుగుసార్లు అమ్మఒడి నిధులు చెల్లించారు.జగనన్న అమ్మఒడి పథకం ద్వారా రాష్ట్రంలో నాలుగేళ్లలో 44,48,865మంది మహిళలకు ఏటా రూ.15వేల రుపాయల నగదు బదిలీ అమలు చేశారు. వసతిదీవెప పథకంలో ఉన్నత చదువుల కోసం హాస్టళ్లలో ఉండే వారి కోసం 25,17,245మందికి పథకాన్ని వర్తింప చేశారు. జగనన్న విద్యా దీవెన పథకంలో 26,98,728మందికి ప్రయోజనం దక్కింది. ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల్లో ప్రధానంగా జగనన్న అమ్మఒడి పథకంలో 44,48,865మందికి రూ.26,067.30కోట్లను జమ చేశారు. జగనన్న వసతి దీవెనలో 25,17,245మందికి రూ.4,275.76 కోట్లను అందించారు. జగనన్న విద్యా దీవెన పథకంలో 26,98,728మందికి రూ.12, 609.68కోట్లను అందించారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో 408మందికి రూ.107.07కోట్లను ఇచ్చారు.అమ్మఒడి పథకం కంటే మెరుగైన నగదు బదిలీ పథకాన్ని అందిస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ ప్రకటించింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దారిద్ర్య రేఖకు దిగువున ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా వారికి నగదు చెల్లిస్తామని ప్రకటించారు.దేశంలో 2009 పార్లమెంటులో చట్టంగా మారిన రైట్ ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం విద్య అనేది లాభాపేక్ష రహితమైన కార్యక్రమం. విద్యను వ్యాపార కార్యక్రమంగా నిర్వహించడం ఆర్టీఈ చట్ట ప్రకారం నిషిద్ధం. ఆర్టీఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తే ప్రభుత్వంపై గణనీయంగా భారం తగ్గుతుంది. దేశంలో విద్య, వైద్య సేవలు డబ్బుతో ముడిపడి ఉన్న అంశాలు కావడంతో వాటిని ఉమ్మడి జాబితాలో పొందుపరిచారు.విద్యా సంస్థలకు అనుమతులు జారీ చేయడం మొదలుకుని వాటి నియమనిబంధనల వరకు ప్రభుత్వం చేతిలోనే ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదనే కారణాలతో ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నా వాటిని కట్టడి చేసే ప్రయత్నాలు మాత్రం విద్యా రంగంలో జరగడం లేదు. ప్రైవేట్ స్కూళ్లలో చదువులకు కూడా అమ్మఒడి వంటి పథకాలను అమలు చేసి ప్రైవేట్ విద్యను గణనీయంగా ప్రోత్సహించారు.విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో శాతం 25శాతం సీట్లను తప్పనిసరిగా ఉచితంగా విద్యార్థులకు కేటాయించాల్సి ఉంటుంది. నాణ్యమైన విద్య కోసమే ప్రైవేట్ పాఠశాలల్ని అన్ని వర్గాల విద్యార్థులు ఆశ్రయిస్తున్న సమయంలో ఆర్టీఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తే విద్యార్థులకు నగదు బదిలీ చేయాల్సిన అవసరం కూడా ఉండకపోవచ్చు.ప్రైవేట్ స్కూళ్లలో విద్యను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం పేదలకు నగదు బదిలీ చేసే బదులు, ఆర్టీఈ చట్టం ద్వారా నిర్బంధంగా 25శాతం సీట్లను పేదలకు కేటాయిస్తే ఆ మేరకు ప్రభుత్వంపై భారాన్ని తగ్గించుకోవచ్చు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో తప్పనిసరిగా 25శాతం సీట్ల కేటాయింపు అమలు కావడంతో లేదు. కానీ ఈ దిశగా చట్టం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నం జరగలేదు. విద్యా హక్కు చట్టం కింద జరిగిన అడ్మిషన్ల వివరాలను బయట పెట్టడానికి కూడా విద్యాశాఖ సుముఖత చూపలేదు.ఏపీలో ఆర్టీఈ చట్టం ద్వారా జిల్లాల వారీగా జరిగిన అడ్మిషన్ల వివరాలను వెల్లడించాలని కోరినా సమగ్రశిక్ష అధికారులు స్పందించలేదు. గత కొన్నేళ్లుగా ఈ చట్టాన్ని బుట్టదాఖలు చేసి ప్రైవేట్ విద్యా సంస్థలకు మేలు చేయడంలో సంబంధిత శాఖ అధికారులు లోపాయికారీగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 61,511 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ పాఠశాలలు 44,407 ఉన్నాయి. ఎయిడెడ్ పాఠశాలలు 940 ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఎయిడెడ్ పాఠశాలల విషయంలో ఆంక్షలతో చాలా స్కూళ్ల ప్రైవేట్ స్కూళ్లుగా మారిపోయాయి. ఉపాధ్యాయుల్ని ప్రభుత్వానికి అప్పగించారు. ప్రైవేట్ పాఠశాలలు 13,359 ఉన్నాయి.మొత్తం పాఠశాలల్లో పదిమందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 13,359 ఉన్నాయి. 20మందిలోపు విద్యార్థులు ఉన్నవి 12,252 ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రైమరీలో చేరిన విద్యార్థుల సంఖ్య 101.66శాతం ఉంటే, అప్పర్ ప్రైమరీలో 97.62శాతం, సెకండరీలో 85.38శాతం, ఇంటర్‌లో 56.7శాతం ఉన్నారు. ప్రభుత్వ టీచర్లు లక్షా 78 వేల 778మంది ఉంటే ఖాళీలు 22,776 ఉన్నాయి.పేదలకు నాణ్యమైన విద్యను అందించడం, చదువుకు ఏ ఒక్కరు దూరం కాకూడదనే ఆలోచనల తో పుట్టిన ఆర్టీఈ చట్టం చాలా సమస్యలకు పరిష్కారం చూపుతుం రంగా మార్చేయడమే శాపాలుగా మారాయి.ఫీజుల నియంత్రణ విషయంలో సైతం విద్యాశాఖగతఐదేళ్లలో చర్యలు తీసుకోలేకపో యిందనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందనే ప్రత్యర్థుల విమర్శలకు చెక్ పెట్టడానికి ఆర్టీఈ చట్టాన్ని సమర్థవం తంగా వినియోగించుకునే అవకాశం పరిష్కారంగా కనిపిస్తోంది. ఏపీ ప్రభుత్వందీనిపైదృష్టిపెడితేకొంత మేరకైనా ఆర్థిక భారాన్ని తగ్గించు కోవచ్చు. పిల్లల్ని చదివించినందుకు ఇస్తున్న ప్రోత్సాహకం ప్రైవేట్ విద్యా సంస్థల పరమవుతున్నందున 25శాతం నిర్బంధ కోటాను పాఠశాలల్లో ఖచ్చితంగా అమలు చేస్తే ప్రయోజనం ఉంటుంది.

## అనంతపురంలో అగ్రిగోల్డ్ చెట్లు మాయం...

అనంతపురం, ఆగస్టు 20, వందలు వేలు కాదు, ఏకంగా కోట్ల ఖరీదు చేసే విలువైన వృక్ష సంపదకు రెక్కలొచ్చాయి. దాదాపు పదేళ్లుగా ఆలనపాలన లేకపోవడంతో కొందరు అక్రమార్కులకు కన్ను కుట్టింది. గుట్టు చప్పుడు కాకుండా వందల ఎకరాల్లో చెట్లను మాయం చేసేశారు. అసలు ఎక్కడ ఎంత సంపద ఉందో కూడా తెలియకుండా రికార్డులు తారుమారు చేసేశారనే ఆరోపణలు ఉన్నాయి.అగ్రిగోల్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్, సీఐడీ స్వాధీనంలో ఉన్న ఫ్యాక్టరీలో యంత్రపరికరాల చోరీ విషయం మరువక ముందే కోట్ల రుపాయల విలువైన వృక్షాలు మాయమైన వ్యవహారం వెలుగు చూసింది. 2015లో అగ్రిగోల్డ్ అక్రమాలపై ఏలూరులో కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిశా, అండమాన్ వంటి రాష్ట్రాల్లో కూడా ఈ వ్యవహారం పాకినట్టు గుర్తించారు.దాదాపు రెండు మూడేళ్ల పాటు సాగిన ప్రాథమిక దర్యాప్తులో వేల ఎకరాల భూముల్ని సీఐడీ అటాచ్ చేసింది. ఆ తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా వీటిని జప్తు చేసింది. సీఐడీ, ఈడీలలో ఎవరికి అగ్రిగోల్డ్ ఆస్తులపై హక్కు ఉంటుందనే వివాదం ఇంకా కొలిక్కి రాలేదు. ఆ కేసులు అలా నడుస్తూనే ఉన్నాయి. మరోవైపు అగ్రిగోల్డ్ ఆస్తుల్ని అందినకాడికి దోచుకునే ప్రయత్నాలు మాత్రం జోరుగా సాగుతూనే ఉన్నాయి.అగ్రిగోల్డ్ ఆస్తుల స్వాధీనంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వందలాది ఎకరాలను అటాచ్ చేశారు. వీటిలో విలువైన వ్యవసాయ భూములు, ఓపెన్ ప్లాట్లు, కమర్షియల్ ఫ్లాట్లు ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలా వందలాది ఎకరాల భూమిని దర్యాప్తు సంస్థలు తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి. అయితే ఎనిమిదేళ్లుగా వాటి బాగోగులు మాత్రం మరచిపోయారు.అగ్రిగోల్డ్ ఆస్తులను జప్తు చేయడానికి ముందే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వందల ఎకరాల్లో శ్రీగంధం, చందనం, నీల్‌గిరి, సుబాబుల్ ప్లాంటే షన్లు చురుగ్గా నడిచాయి. తీర ప్రాంతాలు, పెద్దగా నీటి సదుపా యం లేని భూముల్లో పండే మొక్కల్ని పెంచుతూ వచ్చారు. కొన్ని చోట్ల శ్రీగంధం, ఎర్ర చందనం వంటి వాటిని కూడా సాగు చేశారు. ఎనిమిదేళ్లుగా ఈ మొక్కల్ని పట్టించుకున్న వారు లేరు.ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల్లో వందలాది ఎకరాల్లో సాగు చేసిన చెట్లు కోతకు రావడాన్ని కొందరు అధికారులు గుర్తించారు. అగ్రిగోల్డ్ ఆస్తుల్ని జప్తు చేసిన సమయంలోనే వాటిని జియోఫెన్సింగ్ చేసి సంరక్షించాలనే సంగతిని సీఐడీ గాలికి వదిలేసింది. దీంతో ఎన్నికల సమయంలో అంతా హడావుడిగా ఉన్న సమయంలో విలువైన చెట్లను నరికేసి సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఓ ఐపీఎస్ అధికారి పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడ ఎన్ని చెట్లను నరికేశారనే లెక్కలు ఇప్పటికీ లేవు.అగ్రిగోల్డ్ ప్లాంటేషన్లలో చెట్ల నరికివేతలపై కేసుల విచారణ జరుగుతున్న ఏలూరు కోర్టులో అగ్రిగోల్డ్ డైరెక్టర్లు కొద్ది రోజుల క్రితం పిటిషన్లు వేశారు. కోట్ల రుపాయల ఖరీదు చేసే మొక్కల్ని నరికివేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని వాటిని వేలం వేస్తే డిపాజిటర్లకు నగదు చెల్లించవచ్చని సూచించారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానం పీపీని ప్రశ్నించడంతో బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని చెప్పినా ఆ తర్వాత ఆ సంగతి వదిలేశారు.అనంతపురం జిల్లా పెనుకొండతో పాటు, రొద్దం మండలం పెద్ద గువ్వలపల్లిలో నీలగిరి చెట్లను నరికేసి అమ్మేశారు. ప్రకాశం జిల్లా పామూరు మండలం వెనిగొండ్లలో ఉన్న ప్లాంటేషన్ సైట్లో కూడా చెట్లను మాయం చేశారు. ఒక్కో ప్లాంటేషన్ యూనిట్ 100 నుంచి 200 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుందని ఎన్నికల హడావుడిలో ఈ చెట్లను మొత్తం నరికి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు చెట్ల నరికివేతపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నట్టు సీఐడీ కోర్టులో పేర్కొన్నా చోరీకి గురైన చెట్ల విలువను ఎలా రాబడుతారనే దానికి మాత్రం సమాధానాలు లేవు. ఈ మొత్తం వ్యవహారం సీఐడీలో కీలక పాత్ర పోషించిన అధికారుల కనుసన్నల్లోనే జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి గ్రామంలో ఉన్న 112 ఎకరాల అగ్రి గోల్డ్ భూముల్లో నీలగిరి చెట్లను ఇటీవల నరికేశారు. ఈ వ్యవహారంలో ఓ మహిళా మంత్రి చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. అగ్రిగోల్డ్ భూముల్లో పెరుగుతున్న నీలగిరి చెట్లు కోతకు రావడంతో మంత్రి అనుచరులు వాటిని నరికి సొమ్ము చేసుకున్నారు. పగలు చెట్లను నరికి రాత్రిపూట కర్ణాటకకు అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఈ వ్యవహారంపై అటవీ శాఖ, సీఐడీ చర్యలు తీసుకోకపోవడంతో కోర్టులో ఫిర్యాదు చేశారు.

## 4 రోజుల పాటు 12 ఈవీఎంలలో మాక్ పోలింగ్...

ఒంగోలు, ఆగస్టు 20, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలు వచ్చి కొత్త ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు దాటినా ఇంకా రిజల్ట్స్‌పై వైసీపీ అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉంది. ఆ పార్టీ నేతలు ఇలాంటి స్టోరీలను షేర్ చేస్తుంటే... ఆ పార్టీని సపోర్ట్ చేసే మీడియాలో ఇలాంటి కథనాలు వస్తూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఇప్పుడు ఒంగోలులో జరుగుతున్న వ్యవహారం మరో ఎత్తు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఒంగోలు స్థానం నుంచి ఓడిపోయిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి తన ఫలితాలపై అనుమానపడుతున్నారు. ఈవీఎంలలో ఏదో జరిగిందన్న ఆయన డౌట్స్ క్లియర్ చేయాలని ఎన్నికల సంఘానికి అభ్యర్థన పెట్టుకున్నారు. ఆయన రిక్వస్ట్ మేరకు ఎన్నికల సంఘం కూడా స్పందించింది. డౌట్స్ క్లారిఫై చేసేందుకు మాక్ పోలింగ్ నిర్వహించాలని డిసైడ్ అయింది. ఒంగోలులో అనుమానాస్పదంగా ఉన్న 12 ఈవీఎంలలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. భాగ్యనగర్ గోదాములో ఉన్న ఈవీఎంలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. నాలుగు రోజుల పాటు ఈ మాక్‌పోలింగ్ చేపడతారు. రోజులు మూడు ఈవీఎంలకు మాక్‌పోలింగ్ జరుపుతారు. బెల్ ఇంజినీర్ల సమక్షంలో ప్రక్రియ జరగనుంది అయితే బాలినేని మాత్రం రీ కౌంటింగ్ అడగడంతో కథంతా కోర్టు పరిధిలోకి మారింది. ఇప్పటికే ఖర్చును అంచనా వేసిన ఎన్నికల సంఘం ఆయన నుంచి నగదును డిపాజిట్ చేయించుకుంది. ఇలా ఎవరైనా ఈవీఎంలపై అనుమానం ఉన్న వాళ్లు నగదు చెల్లించి మాక్ పోలింగ్ నిర్వహించు కోవచ్చు. ఇప్పుడు ఒంగోలు విషయంలో అదే జరుగుతోంది. 2024 ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన 26 మంది అభ్యర్థులకి కూడా అధికారులు సమాచారం అందించారు. వాళ్ల సమక్షంలో లేదా వాళ్లు సూచించిన ఏజెంట్ సమక్షంలో మాక్ పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయనున్నారు అధికారులు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రత్యేక కలెక్టర్ ఝాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో ప్రక్రియ పూర్తి చేసి అధికారులకు రిపోర్ట్ అందజేస్తారు.మొన్న జరిగిన ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసిన బాలినేని శ్రీనివాస్ రెడ్డిపై కూటమిలో టీడీపీ నుంచి పోటీ చేసిన దామచర్ల జనార్దన్ రావు విజయం సాధించారు. జనార్దన్‌కు 1,18,800 ఓట్లు వస్తే... బాలినేని శ్రీనివాస్ రెడ్డికి 84,774 ఓట్లు వచ్చాయి. ఇక్కడ పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి నాగలక్ష్మికి 2,067 ఓట్లు నోటాకు 1,310 ఓట్లు వచ్చాయి. ఇక్కడ 26 మంది అభ్యర్థులు పోటీ చేసినా మిగతా వాళ్లెవరికీ ఐదు వందల కంటే ఎక్కువ ఓటు రాలేదు.

## రహస్య ప్రాంతంలో కొనసాగుతున్న వాసుదేవరెడ్డి విచారణ...

విజయవాడ, ఆగస్టు 20, కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ఇటీవల ఏపీలో అరెస్టుల పర్వం మొదలైంది. జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ను పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. తాజాగా ఏపీ బేవరీజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఏపీ సీఐడీ అధికారులు వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేశారని సమాచారం. ఏపీలో మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించారని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఓ అజ్ఞాత ప్రాంతంలో ఏపీ బేవరీజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీని సీఐడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం విక్రయాల విషయంపై వాసుదేవరెడిపై భారీ అభియోగాలు నమోదయ్యాయి.వైసీపీ హయాంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అప్పట్లో డిప్యూటేషన్ పై వాసుదేవరెడ్డిని రప్పించారని వార్తలు వచ్చాయి. ఏపీలో మద్యం విక్రయాలు పెంచే బాధ్యత ఆయనకు జగన్ అప్పగించారని టీడీపీ నేతలు గతంలోనే ఆరోపించారు. దాంతో వాసుదేవరెడ్డి రాష్ట్రంలో డిస్టిలరీలు, డిపోలు, షాపులపై అజమాయిషీ చేశారు. ఇంకా చెప్పాలంటే ఏపీలో జే బ్రాండ్లు తీసుకురావటంలో వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించారట. ఏపీలో మద్యంపై ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టి వైసీపీ ప్రభుత్వం వేల కోట్లు అప్పులు తెచ్చిందని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఏపీలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ దారుణ ఓటమి చవిచూసింది. అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు గత ఐదేళ్లలో జరిగిన పాలనలో లోపాలు, అవినీతిపై ఫోకస్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వాసుదేవరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లగా.. 2 నెలల తరువాత ఏపీ సీఐడీ ఆయనను అరెస్ట్ చేసింది. వాసుదేవరెడ్డి అరెస్ట్ వార్త రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ హయాంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో భారీ అవినీతి జరిగిందని, ఎన్నికల అనంతరం కార్పొరేషన్ ఆఫీసు నుంచి ఫైళ్లు మాయం చేశారని వాసుదేవరెడ్డిపై సీఐడీ కేసు నమోదు చేసింది. తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం వాసుదేవరెడ్డికి మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడం తెలిసిందే.ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మె?గులూరుకు చెందిన శివకృష్ణ ఫిర్యాదుతో వాసుదేవరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్పొరేషన్ నుంచి ఫైళ్లు తరలిస్తున్నట్లు చూశానని ఆ ఫిర్యాదులో శివకృష్ణ పేర్కొన్నారు.

ఈ క్రమంలో ఏపీ సీఐడీ రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లో వాసుదేవరెడ్డికి చెందిన ఓ ఖరీదైన విల్లాలో మూడు రోజులపాటు సోదాలు నిర్వహించారు. ఆయనకు సంబంధించిన నివాసాలలో సోదాల్లో భాగంగా కీలకమైన డాక్యుమెంట్లు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ట్రాఫిక్ సర్వీస్ ఉద్యోగిగా ఉండే వాసుదేవరెడ్డి డిప్యూటేషన్ పై ఏపీ ప్రభుత్వానికి వచ్చారు. అప్పటి సీఎం వైఎస్ జగన్, వాసుదేవరెడ్డికి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు అప్పగించారు. వైసీపీ నేతలకు సంబంధించిన డిస్టిలరీల నుంచి వచ్చే మద్యాన్ని విక్రయించేలా చూశారని, మద్యం ఆదాయం చూపించి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చుకోవడంలోనూ వాసుదేవరెడ్డి కీలకంగా వ్యవహరించాలని టీడీపీ నేతలు ఆరోపించారు.

## ప్యాలెస్ లో కూర్చుని తప్పుడు ట్వీట్లు పెట్టడానికి సిగ్గులేదా జగన్?

**వెలుగొండ ప్రాజెక్టు గురించి నువ్వు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది**

**జగన్ కు ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్ కౌంటర్**

అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో జలవనరుల శాఖ అత్యంత నిర్లక్ష్యానికి, విధ్వంసానికి గురైంది జగన్ హయాంలోనే అని, ఈ విషయం దాస్తే దాగదు అని ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్ అన్నారు. వెలుగొండ ప్రాజెక్టుపై ట్విట్టర్ లో జగన్ చేసిన ట్వీట్ కు ఎమ్మెల్యే జనార్థన్ ఘాటుగా స్పందించారు. వెలుగొండ ప్రాజెక్టు గురించి పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫేక్ రాజకీయంతో లబ్ధి పొందాలనుకునే జగన్ దుర్మార్గపు ఆలోచనలను ప్రజలు విశ్వసించరన్నారు. గత ఐదేళ్లలో మిగిలిన 10 నుండి 20 శాతం పనులు పూర్తిచేసి వెలిగొండ ద్వారా నీళ్లివ్వలేకపోయిన నువ్వు నేడు బెంగళూరు యలహంక ప్యాలెస్ లో కూర్చుని ట్వీట్లు చేయడానికి సిగ్గనిపించడం లేదా అని నిలదీశారు. సలహాదారులకు, సాక్షి పత్రికకు, సర్వే రాళ్లపై బొమ్మలకు చేసిన ఖర్చు ఎంతో...సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసింది ఎంతో దమ్ముంటే ప్రకటించాలని సవాల్ విసిరారు.

## కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అలక...

విజయవాడ, ఆగస్టు 20, తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కూటమి విజయం సాధించిన తర్వాత కనిపించడం మానేశారు. దాదాపు రెండు నెలల నుంచి ఆయన పెద్దగా వినిపించడం లేదు. కనిపించడం లేదు. పార్టీ అధికారంలో లేనప్పుడు ఏ నేత అప్పటి అధికార పార్టీపై విమర్శలు చేసేందుకు వెనుకాడినప్పుడు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఒక్కరే తన మాటలతో ?విరుచుకుపడేవారు. అంతేకాదు ఆయన ప్రతి రోజూ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం పెట్టి అధికార పార్టీని చీల్చిచెండాడేవారు. అలాంటి పట్టాభి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఎక్కువగా మౌనాన్ని ఆశ్రయిస్తున్నట్లు కనపడుతుంది.కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చేసిన పదునైన విమర్శలతో నాటి అధికార వైసీ?పీకి ఆయన శత్రువుగా మారారు. ఆయన ఇంటిపై దాడులు కూడా జరిగాయి. పట్టాభి కొన్ని కేసుల్లో అరెస్టయి రాజమండ్రి జైలుకు వెళ్లి వచ్చారు. ఎన్నో కేసులు ఎదుర్కొన్నారు. మాటలు పడ్డారు. గాయపడ్డారు. అయినా టీడీపీ విషయంలో వెనక్కు తగ్గలేదు. చంద్రబాబు నాయుడు స్వయంగా కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఇంటికి వచ్చి మరీ ఆయనను పరామర్శించి వెళ్లారు. మిగిలిన సీనియర్ నేతలు అందరూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నప్పటికీ పట్టాభి అంతా తానే అయి కేంద్ర పార్టీ కార్యాలయంలో తన వాయిస్ ను బలంగా వినిపించే వారు. అప్పుడప్పుడు కొన్ని మీడియా ఛానల్స్ లో మాత్రం కనిపిస్తున్నారు.అయితే కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కు అధికారంలోకి వచ్చిన తర్వాత కీలకమైన పదవి వస్తుందని అందరూ భావించారు. రేపు చంద్రబాబు భర్తీ చేయబోయే పోస్టులలో పట్టాభికి ఖచ్చితంగా ఒక పదవి వస్తుందన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. యువకుడు కావడం, మంచి వాగ్దాటి ఉండటంతో పట్టాభికి మంచి పదవినే చంద్రబాబు కట్టబెట్టే అవకాశాలున్నాయంటున్నారు. అందుకోసమే పట్టాభి వెయిట్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు పార్టీ అగ్రనాయకత్వం నుంచి పట్టాభికి సంకేతాలు అందినట్లు చెబుతున్నారు. అది కూడా కీలకమైన క్యాబినెట్ ర్యాంక్ ఉన్న పదవిని చంద్రబాబు పట్టాభి కోసం సిద్ధం చేసినట్లు అంటున్నారు. పదవిలోకి వచ్చిన తర్వాత కొంత ఆచితూచి మాట్లాడాలని, తక్కువగా మాట్లాడి ఎక్కువ పనులు చేయాలని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో పాటు మంత్రులు విపక్షానికి కౌంటర్లు ఇస్తుండటంతో ఇక తనకు పెద్దగా పనిలేదని ఆయన భావిస్తున్నారు. దీంతో పాటు పదవి వచ్చేంత వరకూ ఒకింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందుకే గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి అంశం పై కూడా ఆయన పెద్దగా స్పందించడం లేదంటున్నారు. కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పదవి కోసమే వెయిట్ చేస్తున్నారని తెలిసింది. కొద్ది రోజులలోనే పట్టాభి తిరిగి యాక్టివ్ అవుతాడంటున్నారు.

## పార్టీ మౌత్ పీస్ గా భారతి...?



కడప, ఆగస్టు 20, ఏపీ రాజకీయాల్లో రెండురోజులుగా ఓ వార్త తెగ హంగామా చేస్తోంది. అది వైసీపీ పార్టీ గురించే. ఇంతకీ దాని సారాంశం ఏంటంటే.. పార్టీ పగ్గాలు భారతి చేతుల్లోకి వెళ్లబోతోందనేది అసలు వార్త. దీనిపై వైసీపీ నేతలు, కార్యకర్తలు రకరకాలుగా చర్చించుకోవడం మొదలైంది. ఇది కలా.. నిజమా అన్న చర్చ లేకపోలేదు.అధికారం పోయిన తర్వాత గడిచి రెండునెలల్లో ఐదుసార్లు బెంగుళూరు వెళ్లారు వైసీపీ అధినేత జగన్. ఎందుకు వెళ్లారన్నది పక్కనబెడితే.. మీడియా ముందుకు వచ్చిన ప్రతీసారీ ఆయన తర్జనభర్జన పడుతున్నారు. ఏ విషయంపైనా క్లారిటీ ఇవ్వలేదు. మీడియా ప్రశ్నలకు సమాధానం దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు.జగన్ వ్యవహారశైలిని గమనించిన ఆ పార్టీకి చెందిన నేతలు అధినేత ఇలా వ్యవహరిస్తున్నారేంటి అని చర్చించుకోవడం మొదలైంది. వైసీపీ ప్రభుత్వం చేసిన అవినీతిపై చంద్రబాబు సర్కార్ దృష్టి సారించింది. ఇప్పటివరకు 13 కేసులు నమోదు చేసింది. రేపోమాపో వాటిని సీఐడీ బదలాయించాలని భావిస్తోంది. ఎందుకంటే ఆయా కేసుల్లో మనీ లాండరింగ్ అంశాలు ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది.ప్రతిపక్ష హోదా కావాలని జగన్ డిమాండ్ చేయడం వెనుక ఉద్దేశం ఇదేనని అంటున్నారు టీడీపీ నేతలు. ప్రతిపక్ష నేతయితే అరెస్టు వంటివి ఏమైనా జరిగితే ముందుగా గవర్నర్ వద్దకు విషయం వెళు తుందని, తనకున్న పరిచయాలతో కేంద్రంతో మేనేజ్ చేసుకోవచ్చని భావించి ప్రతిపక్ష హోదా గురించి డిమాండ్ చేశారని అంటున్నారు. లిక్కర్ స్కామ్.. కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని టీడీపీ ప్రధాన ఆరోపణ. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. బేవరేజ్ మాజీ ఎండీని సీఐడీ అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రేపు మాపో జగన్ చుట్టూ ఉచ్చు బిగుసుకోవచ్చని అంటున్నారు. జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో భారతికి పార్టీ పగ్గాలు అప్పగించేందుకు జగన్ సిద్ధమైనట్లు ఆ పార్టీలో నుంచి ఫీలర్ బయటకు వచ్చింది.జగన్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలాంటి ఫీలర్ వైసీపీ నుంచి బయటకు వచ్చింది. తాను జైలుకి వెళ్తే.. సతీమణికి పగ్గాలు అప్పగించాలని జగన్ అప్పట్లో భావించినట్లు వార్తలు వచ్చాయి. మరి ఏ విధంగా మేనేజ్ అయ్యిందో తెలీదుగానీ అది గాసిప్ గానే మిగిలిపోయింది.జగన్ అధికారం కోల్పోయాక అధికార టీడీపీపై విమర్శలు సంధిస్తున్నారు. రూలింగ్ పార్టీ కంటే.. కాంగ్రెస్ నుంచి వైసీపీకి కౌంటర్లు పడిపోతున్నాయి. షర్మిలను ఎదుర్కోవాలంటే భారతి బెటరని భావిస్తున్నా రట మాజీ సీఎం. మీడియా ముందు ఎలా మాట్లాడాలి.. ప్రత్యర్థులను ఎలాంటి విషయాల్లో ఇరుకున పెట్టాలనే దానిపై భారతికి ట్రైనింగ్ ఇస్తున్నట్లు సమాచారం.భారతి మాట్లాడితే పార్టీకి జోష్ వస్తుందని, కూటమి సర్కార్ అంతగా రియాక్ట్ కాదని ఆలోచన చేస్తున్నారట జగన్. మరి ఈ వార్తయినా నిజమవుందా? లేక గాసిప్‌గా మిగిలిపోతుందన్నా అన్నది చూడాలి.

## పిడుగు పడి 32 గొర్రెలు మృతి

నంద్యాల,నంద్యాల జిల్లా అవుకు మండలం సంగాపట్నం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పిడుగు పడి 32 గొర్రెలు మృతి చెందాయి. సంగపట్నం గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటేశ్వర్లుకు చెందిన 32 జీవాలు మేత మేసేందుకు కొండ ప్రాంతానికి వెళ్ళాయి. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే గొర్రెలు మృతి చెందాయి.

# ముఖ్యమైన ఫైల్స్ పైనే... మంటలు....

విజయవాడ, ఆగస్టు 20,ఏపీలో ఈ మధ్య విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరిగి ముఖ్యమైన ఫైల్స్ మాత్రమే కాలిపోయే స్కీమ్ నడుస్తుంది. గడిచిన మూడు నెలల కాలంలో ఏపీ లో జరుగుతున్న ప్రమాదాల పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.గతంలో అగ్ని ప్రమాదం జరిగితే ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలు, అందులోని వస్తువులు ఇలా ఆస్తి నష్టమో లేదా కొన్ని సందర్భాల్లో ప్రాణ నష్టమో జరిగేది. కాని ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలు మాత్రం కేవలం ఫైల్స్ మాత్రమే కాలిపోయి సాక్షం లేకుండా అయ్యేలా ప్రమాదాలు జరుగుతుండడం గమనార్హం. ఇలాంటి ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం సైతం సీరియస్ గా దృష్టి పెట్టింది.మొన్న అమరావతి, నిన్న మదనపల్లి, దవళేశ్వరం కార్యాలయం.. నేడు తిరుపతి... అగ్ని ప్రమాదాలు. తిరుమల తిరుపతి దేవస్థానం లో అనేక అవకతవకలు జరిగాయని, తిరుమలను కూడా వ్యాపార కేంద్రంగా మార్చారని కూటమి ప్రభుత్వం ఆరోపణలు చేసింది. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎనలేని మెజారిటీతో గెలిపించారు. ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తిరుమల కు వచ్చిన నారా చంద్రబాబు నాయుడు తిరుమల నుంచే ప్రక్షాళన చేస్తానని చెప్పారు. అందుకు తగిన రీతిలో అప్పటి వరకు ఈవో లేకపోవడంతో కొత్త ఈవో నియామకం, అదనపు ఈవో గా ఉన్న ఏవీ ధర్మారెడ్డి ను పంపివేయడం... కొత్తగా తిరుమల అదనపు ఈవో నియామకం చేయడం... సీవీఎస్వో సహా అందరినీ మార్చడం చేశారు. ఇలా ప్రారంభమైన ప్రక్షాళన గత ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక ఇంజినీరింగ్ పనులు, రివర్స్ టెండర్స్, శ్రీవాణి ట్రస్ట్ నిధులపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ విభాగం చేత విచారణ ప్రారంభించారు. టీటీడీ లాంటి పుణ్యక్షేత్రం లో విజిలెన్స్ విచారణ అంటేనే దేశ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది.టీటీడీ లో గత ప్రభుత్వంలో జరిగిన అనేక ఇంజినీరింగ్ పనులకు సంబంధించి వివరాలు ఇవ్వని, సరైన పత్రాలు చూపించని టీటీడీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 55 మంది ఇంజనీర్లకు రాష్ట్ర విజిలెన్స్ విభాగం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దానిపై ఇంజినీరింగ్ యూనియన్ సభ్యులు స్థానిక నాయకులను, అధికారులను సైతం కలిసారు. వారు నుంచి సానుకూలంగా స్పందించినా ఈనెల 14న సమావేశం నిర్వహించి అవసరమైతే సమ్మె చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారు. అయితే సమావేశం వాయిదా పడింది. రెండు రోజుల వ్యవధిలో అగ్ని ప్రమాదం కలకలం రేపింది.టీటీడీ పరిపాలన భవనంలో శనివారం సాయంత్రం ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ భాస్కర్ ఛాంబర్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పలు కీలక ఫైల్స్ దగ్ధం అయ్యాయి. గదిలో నుంచి పొగలు రావడాన్ని గుర్తించి టీటీడీ భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిని ఆర్పివేసారు. అయితే ఎలా ప్రమాదం జరిగిందని అధికారులను అడిగితే ప్రతిరోజు పూజించే దీపం పడి ప్రమాదం జరిగిందేమే అని అంటున్నారు. టీటీడీ పరిపాలన భవనం ఇటీవల కాలంలో రినోవేషనే చేశారు. అన్ని విభాగాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాంటి టీటీడీ పరిపాలన భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం లేదు. మరీ దీపం పడి ఫైల్స్ మాత్రమే కాలిపోవడం ఏంటని ప్రశ్న వినిపిస్తుంది. సమాచారం అందుకున్న టీటీడీ ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఆ గదిలో ఏఏ రికార్డులు ఉన్నాయి.. అవి ఈ ఫైలింగ్ లో ఉన్నాయా లేదా... అసలు ప్రమాదానికి కారణం ఏంటి... ఏదైన కుట్ర కోణం ఉ ందా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## 22మంది నకిలీ రైతులను సృష్టించి రూ.6 కోట్లు

ఏలూరు, ఆగస్టు 20, మదనపల్లె ఫైల్స్ దహనం ఘటనపై విచారణ ఇంకా జరుగుతూనే ఉంది. ఇంతలోనే ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులోని ఫైళ్లు దగ్ధమయ్యాయి. పోలవరం ఎడమ కాల్వ కింద చేసిన భూసేకరణలో భారీ స్కామ్ జరిగిందన్న ఆరోపణలున్నాయి. అందులో అప్పటి స్పెషల్ కలెక్టర్ వాటానే 19 కోట్లని లెక్కతేలింది. దానిపై ఎంక్వయిరీ జరుగుతుండగానే సంబంధిత ఫైల్స్ తగలబడటం కలకలం రేపుతోంది. అవి జిరాక్స్ కాపీలే.. వేస్ట్ తగులబెట్టామని అధికారులు అంటున్నారు. అయితే ఆ ఫైల్స్‌పై సంతకాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి బయటపడకుండా ప్రభుత్వ సిబ్బందే వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఏపీలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ దగ్ధం ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో కీలకమైన ఫైల్స్ తగలబడిన ఘటనపై విచారణ జరుగుతుండగానే .. ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్ట్ పరిపాలన కార్యాలయంలో ఫైల్స్ దగ్ధమయ్యాయి. అవి పోలవరం ఎడమ ప్రధాన కాల్వకు సంబంధించిన డాక్యుమెంట్స్ గా చెబుతున్నారు. కార్యాలయంలోని అధికారులే కాల్చేశారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.కొత్త బీరువాలు కొని పాతవన్నీ క్లీన్ చేస్తూ వేస్ట్ పేపర్లను దహనం చేసినట్టు అధికారులు చెబుతున్నా.. ఇది మరో మదనపల్లె ఘటనే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ భూదందాలు బయటకు వస్తాయని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇతర వైసీపీ నేతలు , అక్కడి సిబ్బంది సహకారంతో మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలోని ఫైళ్లు తగలబెట్టించారన్న ఆరోపణలున్నాయి. దాన్ని సీనియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఘటన జరిగిన వెంటనే డీజీపీని హెలికాప్టర్‌లో అక్కడకి పంపించారు. ప్రస్తుతం దానిపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది.ఇప్పుడు పోలవరం ఫైల్స్ వంతు వచ్చింది. పోలవరం ప్రధాన ఎడమ కాలువ పనుల కోసం చేపట్టిన భూసేకరణ చెల్లింపుల్లో భారీ స్కామ్ జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 19 కోట్లు దాకా మింగేశారని చెబుతున్నారు. తాజాగా దహనమైంది ఆ ప్రధాన ఎడమ కాలువ భూసేకరణ కార్యాలయంలోని ఫైళ్లే అవ్వడం కలకలం రేపుతోంది. సమాచారం తెలిసి మీడియా ప్రతినిధులు అక్కడకు వెళ్లడంతో సగం కాలిన ఫైళ్లను, పత్రాలను అక్కడి అధికారులు లోపలకు తీసుకుని వెళ్లి దాచేయడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తుంది.పోలవరం ప్రాజెక్ట భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు అమలుచేసే కార్యాలయం ధవళేశ్వరంలో ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి మీదుగా విశాఖపట్నానికి నీటిని తీసుకెళ్లడానికి పోలవరం ప్రాజెక్టు నుంచి 212 కిలోమీటర్ల మేర ఎడమ ప్రధాన కాలువను నిర్మిస్తున్నారు. ఇందులో చాలా వరకూ భూసేకరణ జరిగింది. దానికి సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు సంబంధించిన ఫైళ్లు, ఎవరి భూమిని ఎంతకు, ఎపుడు సేకరించామనే ఫైళ్లు ధవళేశ్వరంలో ఉన్నాయి. గతంలో స్పెషల్ కలెక్టర్‌గా పనిచేసిన అధికారి దేవీపట్నం తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులకు దక్కకుండా రూ.19 కోట్లు కాజేశారన్న ఆరోపణలున్నాయి.22మంది నకిలీ రైతులను సృష్టించి రూ.6 కోట్లు నొక్కేసినట్లు నమోదైన కేసు కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉ ద్దేశపూర్వకంగానే ఫైళ్లకు నిప్పుపెట్టారన్నఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. . ఘటన వెలుగు చూడగానే రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి. జిల్లా అధికారులకు దానిపై సమాచారం ఇచ్చారు. తాను స్వయంగా కార్యాలయానికి వెళ్లి కాగిన ఫైళ్లను పరిశీలించారు. అధికారులను గట్టిగా నిలదీశా రు.ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి లబ్ధిదారులకు పరిహారం విషయంలో అక్రమాలు బయటపడతాయనే భయంతోనే ఫైళ్లు తగులబెట్టారని అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విచారణ చేస్తున్నారు. పోలవరం విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి బయటపడకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపిస్తున్నారుపోలవరం దస్త్రాల దహనం ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలకు వెనుకాడబోమని మంత్రి కందుల దుర్గేశ్ హెచ్చరిస్తున్నారు. కార్యాలయాన్ని సందర్శించిన ఆయన తగలబడిన దస్త్రాలను పరిశీలించడంతో పాటు నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దహనమైన వాటిని రాజమహేంద్రవరం ఆర్డీవో శివజ్యోతి జిరాక్స్ పేపర్లుగా ప్రకటించడంపై అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆనవాళ్లను మాయం చేస్తున్నారని విమర్శించారు.మొత్తమ్మీద ప్రభుత్వ కార్యాలయాల్లో వరుసగా ఫైళ్లు దగల పడుతుండటం చర్చనీయాంశంగా మారాయి. గత అయిదేళ్లలో వైసీపీ నేతలతో అంటకాగిన ప్రభుత్వ సిబ్బంది. అప్పటి అవినీతి భాగోతాలు తమ మెడకు చుట్టుకోకుండా ఉండటానికే ఈ తంతంగాలకు పాల్పడుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## పార్టీలో మార్పుల దిశగా చర్యలు

విజయవాడ, ఆగస్టు 20, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీలో సమూల మార్పులు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. యాక్టివ్ గా లేని నేతలను పార్టీ పదవుల నుంచి తప్పించాలని ఆయన నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఆంధ్రప్రదేశ్ లో కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా ఒకరిద్దరు గొంతు మినహా మిగిలిన వారంతా మౌనంగా ఉండటాన్ని ఆయన తప్పుపడుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అంతా తామే అయినట్లు వ్యవహరించిన నేతలు కూడా ఓటమి చెందిన వెంటనే ఇలా నీరుగారి పోవడంతో పార్టీ శ్రేణులు డీలా పడుతున్నాయని గ్రహించారు. అందుకే ముందు జిల్లాల వారీగా నాయకత్వాలను మార్చాలని వైఎస్ జగన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే అన్ని జిల్లాలకు సంబంధించిన సమాచారాన్ని ఆయన తెప్పించుకుని కసరత్తు చేస్తున్నారు. కొత్త నాయకత్వానికి బాధ్యతలను అప్పగిస్తే జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్ రెడ్డి వంటి వారు మినహా మిగిలిన నేతలు ఎవరూ బయటకు వచ్చేందుకు కూడా ఇష్టపడటం లేదు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను కూడా వైసీపీ నేతలు ఉపయోగించుకోలేకపోతున్నారని వైఎస్ జగన్ అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది. శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థుల జాడ కూడా కనిపించడం లేదు... వైసీపీ ప్రభుత్వ హాయాంలో మంత్రులుగా చెలాయించిన వారు కూడా కనీసం ప్రభుత్వంపై విమర్శలకు దిగకపోవడాన్ని ఆయన అభ్యంతరం చెబుతున్నారు. అలాగే జిల్లా నేతల నిర్వాకం కారణంగానే అనేక మున్సిపాలిటీలు,కార్పొరేషన్లు చేజారిపోతున్నట్లు గ్రహించారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పార్టీని వీడుతున్నా కనీసం ఆపేందుకు కూడా వైసీపీ నేతలు ప్రయత్నించకపోవడాన్ని వైఎస్ జగన్ సీరియస్ గా తీసుకున్నట్లు తెలిసింది. 2019 నుంచి 2024వరకూ యాక్టివ్ గా ఉ ండటంతో కొందరు నేతలను జిల్లా అధ్యక్షులుగా నియమించారు. ఇప్పుడు వారి స్థానంలో కొత్త వారికి అవకాశమిస్తే కొంత ఫ్యాన్ పార్టీ వాయిస్ బలంగా వినపడుతుందని ఆయన భావిస్తున్నారు. ముందు జిల్లా స్థాయిలో పార్టీని ప్రక్షాళన చేసి తర్వాత నియోజకవర్గాలపైనే కూడా వైఎస్ జగన్ ఫోకస్ పెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. ఎందుకంటే నియోజకవర్గాల్లో కూడా పార్టీ కార్యక్రమాలు పూర్తిగా కనిపించడం లేదు. కేవలం తనను కలిసేందుకు మాత్రమే నేతలు వస్తున్నారు తప్పించి, జనాల్లోకి వెళ్లే ప్రయత్నం నేతలు చేయకపోవడంతో ప్రభుత్వంపై వ్యతిరేకతను క్యాష్ చేసుకోలేకపోతున్నామని ఆయన బలంగా విశ్వసిస్తున్నారు. పట్టున్న ప్రాంతాల్లోనూ నేతలు నీరుగారి పోవడంపై ఆరా తీస్తున్నారు. కొందరు నేతలు వ్యాపారాలకు పరిమితమవ్వగా, మరికొందరు నేతలు ఇతర ప్రాంతాలకు వెళ్లి నియోజకవర్గాలకు దూరంగా ఉండటాన్ని కూడా వైఎస్ జగన్ గమనించి అందుకు అవసరమైన చర్యలను ప్రారంభించినట్లు తెలిసింది. త్వరలోనే పార్టీలో సమూల ప్రక్షాళన జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## నకిలీ సర్టిఫికెట్లపై సెర్ఫ్ గురి....

కాకినాడ, ఆగస్టు 20, ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.ముఖ్యంగా పింఛన్ల మొత్తాన్ని పెంచి అందించింది. జూలై,ఆగస్టులో ఇంటింటా పింఛన్ల పంపిణీని విజయవంతంగా పూర్తి చేయగలిగింది. అయితే పెంచిన పింఛన్ మొత్తం ఐదేళ్లపాటు అందించాలంటే ప్రభుత్వంపై తప్పకుండా భారం పడడం ఖాయం. దీనికి తోడు బీసీలకు 50 సంవత్సరాలు దాటితే పింఛన్ అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు.ఆ హామీ తప్పకుండా అమలు చేయాల్సి ఉంటుంది. అదే జరిగితే పింఛన్ల లబ్ధిదారులు భారీగా పెరిగే అవకాశం ఉంది. వైసిపి హయాంలో సామాజిక పింఛన్ మొత్తం మూడు వేల రూపాయలుగా ఉండేది. దివ్యాంగులకు 4000 పింఛన్ అందేది. తాము అధికారంలోకి వస్తే సామాజిక పింఛన్ మొత్తాన్ని 4 వేలకు పెంచుతానని చంద్రబాబు ప్రకటించారు. దివ్యాంగులకు 4000 నుంచి 6000 కు పెంచుతానని హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేసి నిలబెట్టుకున్నారు. అయితే ఇలానే ముందుకు సాగితే మాత్రం పింఛన్ల రూపంలోనే ప్రభుత్వంపై భారం తప్పదు. అందుకే పెన్షన్ లబ్ధిదారుల్లో అనర్హుల గుర్తింపు పై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 67 లక్షల మంది వివిధ కేటగిరిలో పెన్షన్లు అందుకుంటున్నారు. ముఖ్యంగా ఫేక్ సర్టిఫికెట్లతో దివ్యాంగ పెన్షన్లు పొందుతున్నారన్నది ప్రధాన అభియోగం. ఇటువంటి వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే చేస్తోంది. నకిలీ ధృపత్రాలను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల మంది దివ్యాంగులు పెన్షన్లు అందుకుంటున్నారు. ఇందులో 60 వేల మందికి పైగా ఫేక్ పత్రాలతో పింఛన్లు అందుకున్నారన్నది ప్రభుత్వానికి వచ్చిన ఫిర్యాదు. వీరందరికీ వచ్చే నెలలో పింఛన్లు అందించడం డౌటే.ప్రభుత్వానికి ఇటీవల సెర్ఫ్ ఒక నివేదిక ఇచ్చింది. 60 వేల మంది తిరిగి నిర్ధారణ పరీక్షలు జరుపుకోవాలని తేల్చింది. గత రెండు నెలలుగా పింఛన్ల పంపిణీలో చాలామంది అనర్హులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వం మారడంతో ఈ పింఛన్లపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు కూడా వచ్చాయి. అటువంటి వారికి నోటీసులు జారీ అవుతున్నాయి. వైకల్యం నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని సూచిస్తున్నారు. అటువంటి వారంతా తమ దివ్యాంగ నిర్ధారణ పరీక్ష చేసుకొని అర్హత సాధించాల్సి ఉంటుంది. లేకుంటే మాత్రం పింఛన్లలో కోత తప్పదు.చాలామంది నకిలీ ధ్రువపత్రాలతో పెన్షన్లు పొందుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. అందుకే ఇప్పుడు సర్వే చేస్తున్నారు. అటు దివ్యాంగ సర్టిఫికెట్ల జారీలో కొంతమంది వైద్యులు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. అదే సమయంలో కూటమి పార్టీల నేతలు సైతం పెద్ద ఎత్తున ఫోకస్ చేశారు.

## రాత్రి గస్తీ కోసం ఆర్మ్ డ్ సిబ్బంది

కాకినాడ యాంకర్: కాకినాడ జిల్లా కేంద్రం కాకినాడ నగరంతో పాటు ఈ నగరాన్ని చేర్చి ఉన్న రూరల్ ప్రాంతంలో గత కొంతకాలంగా దొంగతనాల సంఖ్య పెరిగింది. అదేవిధంగా కాకినాడ నగరం గంజాయి బ్యాచ్ కు అడ్డాగా మారిందంటూ గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్ పి విక్రాంత్ పాటిల్ పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. కాకినాడ, కాకినాడ రూరల్ తదితర ప్రాంతాలలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.వాయిస్:ఇందులో భాగంగా ఈ రెండు సర్కిళ్ల పరిధిలో రాత్రివేళ గస్తీ పెంచారు. ప్రస్తుతమున్న లా అండ్ ఆర్డర్ పోలీసుల సంఖ్య సరిపోకపోవడంతో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బందిని కూడా ఇందుకోసం వినియోగిస్తున్నట్లు పర్యవేక్షణ చేస్తున్న కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ వెల్లడించారు .సిటీ, రూరల్ జంట నగరాలుగా ఉన్నాయి. రెండు కలిసే ఉంటాయి. ఈ రెండు ప్రాంతాలలోకి ప్రవేశించే అన్ని ప్రధాన రహదారుల వద్ద కూడా తనిఖీలు ముమ్మరం చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి మరునాటి ఉదయం వరకు రాత్రి గస్తీ పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అనుమానితులు ఎవరూ బయట తిరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, ఆకతాయి చేష్టలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా సి ఐ తెలిపారు.దీనికి తోడు ఎస్ పి ఆదేశాల మేరకు ట్రాఫిక్ 1,2 సి ఐ నూని రమేష్ ఆధ్వర్యంలో రాత్రి వేళ వాహన చోదకులు,డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ టెస్టులు నిర్వహిస్తున్నారు.పగలు వాహనాల తనిఖీ చేపడుతున్నారు.అనుమానితులను అదుపులోకి తీడుకుంటున్నారు.మద్యం తాగి వాహనాలు నడిపేవారి ని మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తుండగా మందుబాబులకు 10 వేల వంతున జరిమానా లేదా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తున్నారు.తద్వారా మద్యం తాగి వాహనాలు నడిపేవారి సంఖ్య తగ్గడంతో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతోందని సి ఐ లు చైతన్యకృష్ణ, రమేష్ తెలిపారు.

## ద్వారకలో వైభవంగా కృష్ణాష్టమి

### అప్పుడే మొదలైన సంబరాలు

ద్వారక,ఆగస్ట20(ఆర్ఎన్ఎ): శ్రీకృష్ణ జన్మాష్టమిని హిందువులు అత్యంత ఘనంగా జరుపుకుంటారు. ఈ ఏడాది కృష్ణ జన్మాష్టమి వచ్చే సోమవారం అంటే ఆగస్టు 26వ తేదీన రానుంది. దీంతో శ్రీకృష్ణుడి పుట్టిపెరిగిన ద్వారకలో ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడానికి ప్రసలు సిద్దం అవుతున్నారు. జన్మాష్టమి సందర్భంగా దేశవ్యాప్తంగానే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కన్నయ్య ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంటుంది. ఈ పండుగ సంబరాలను మధుర, బృందావన్ నుంచి ఇస్కాన్ వరకు విభిన్నమైన వాతావరణాన్ని.. వేడుకల వైభవాన్ని చూడవచ్చు. అయితే శ్రీ కృష్ణుడు ఏలిన నగరమైన ద్వారకలో మాత్రం అన్ని ఆలయాలకు భిన్నంగా వేడుకలు జరుగుతాయి. జన్మాష్టమికి కొన్ని రోజుల ముందుగానే ద్వారకను అందంగా అలంకరించారు. ముక్తి నగరంగా పిలువబడే ద్వారక నవ వధువు కంటే తక్కువ కాదు. హిందూ క్యాలెండర్ ప్రకారం శ్రీ కృష్ణ జన్మాష్టమిని శ్రావణ మాసంలోని కృష్ణపక్ష అష్టమి తిథిని జరుపుకుంటారు. శ్రీ కృష్ణుడు రోహిణీ నక్షత్రంలో జన్మించాడు. ఈ రోజు ద్వారకలో కృష్ణ జన్మోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ద్వారక భారతదేశంలోని పశ్చిమ రాష్ట్రమైన గుజరాత్‌లో ఉంది. ఇక్కడ జన్మాష్టమి పండుగ చాలా రోజుల ముందుగానే ప్రారంభమవుతుంది. కన్నయ్య పుట్టిన రోజు వేడుకలను చూసి అద్భుతమైన అనుభూతిని పొందాలనుకుంటే జన్మాష్టమి రోజున ద్వారకకు తప్పకుండా వెళ్ళాల్సిందే.. కన్నయ్య దర్శనం కోసం లక్షల మంది ఇక్కడికి వస్తుంటారు. కృష్ణ జన్మాష్టమి రోజున శ్రీకృష్ణుని విగ్రహాన్ని విలువైన ఆభరణాలతో అలంకరిస్తారు. రాత్రి ఆభరణాలతో అలంకరించి దాదాపు అరగంట తర్వాత శ్రీకృష్ణుడికి నైవేద్యంగా పెడతారు. అయితే ఈ కార్యక్రమాలు అన్నీ భక్తులు దర్శించలేరు. రాత్రి 12 గంటలకు కన్నయ్య కు స్వాగతం పలుకుతారు. దాదాపు 2 గంటల తర్వాత రాత్రి 2 గంటలకు ఆలయాన్ని మూసివేస్తారు.అనంతరం ఉదయం 7 గంటలకు మంగళ హారతితో శ్రీకృష్ణుని పూజలు ప్రారంభమవుతాయి. కన్నయ్యకు భోగ్ సమర్పించి తెరను తొలగిస్తారు.

